‘జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం’లో అక్రమ నిర్మాణాలు

- దర్జాగా ఆక్రమణలు
- నోరుమెదపని జీవీఎంసీ అధికారులు

పీఎం పాలెం: జీవీఎంసీ 6, 7వ వార్డులలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. కొంతమంది ప్రభుత్వ అధికారులను మచ్చిక చేసుకుని, పదిమంది ప్రయోజనం కోసం కేటాయించిన స్థలాలను దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. తమకు నచ్చిన విధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే, పీఎం పాలెం, మధురవాడ ప్రాంతాలలో జేఎన్ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద వేలాది గృహాలు నిర్మించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం గృహ వసతిని కల్పించింది. ఈ లబ్ధిదారులందరూ పేద, దిగువ తరగతికి చెందినవారే. పీఎం పాలెం బీ–1 కాలనీ, గాయత్రీనగర్, కే–1 కాలనీ సేవాలనగర్, 7వ వార్డులోని వాబంబే కాలనీ, మారికవలస, కొమ్మాది రాజీవ్ గృహకల్ప కాలనీలుగా ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందాయి.


డాబాపై అక్రమ నిర్మాణాలు


కాలనీలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు


కాలనీలో అక్రమ కట్టడం

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

ఈ కాలనీల్లో బ్లాకులుగా విభజించి, నాలుగు అంతస్తులుగా బ్లాకుకు 16 ప్లాట్లుగా, కొన్ని చోట్ల మూడు అంతస్తులు, 12 ప్లాట్లుగా నిర్మించారు. 16 ప్లాట్లున్న బ్లాకులో మిగతా వారు 2, 3, 4 అంతస్తులలో నివసించాల్సి ఉంటుంది. అయితే గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్నవారు తమకు కేటాయించిన స్థలంలో కాకుండా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిర్మాణ రూపురేఖలను మార్చివేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడానికి వీలుగా అధికారిక నిర్మాణాలను కూలగొట్టి, కొత్తగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ స్థలాలను అక్రమించుకుంటున్నారు.

పార్కింగ్ సమస్య

బ్లాకులో నివసిస్తున్న 16 కుటుంబాల ప్రయోజనం కోసం వినియోగించుకోవలసిన ప్రభుత్వ స్థలాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్నవారు తమకు అనుకూలంగా మార్చుకుని అక్రమ నిర్మాణాలతో తెలివిగా కబ్జా చేస్తున్నారు. వీరి నిర్వాకం కారణంగా రెండు, మూడు, నాలుగు అంతస్తులలో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన వాహనాలకు పార్కింగ్ స్థలం లేకుండా పోయిందని ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అలాగే నాల్గవ ఫ్లాట్‌లో నివసిస్తున్నవారు అందరికీ ఉపయోగపడవలసిన డాబాపై నిర్మాణాలు చేపట్టి, అందరికీ చెందవలసిన స్థలాన్ని తమ సొంతం అన్నట్టుగా మిగతా నివాసిత కుటుంబాలపై అజమాయిషీ చెలాయిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డూ అదుపు లేకుండా..

పీఎం పాలెం, మధురవాడ ప్రాంతంలోని అన్ని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలలో ఇదే పరిస్థితి నిరాటంకంగా కొనసాగుతోంది. ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని, నివాసితులందరికీ పార్కింగ్ సదుపాయం కల్పించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ


అక్రమంగా నిర్మించిన షెడ్

ఆక్రమణలపై ఉక్కుపాదం



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీల్లో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో దర్యాప్తు జరుపుతున్నాం. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం నేరం. కాలనీలలోని బ్లాకులలో నివసిస్తున్న అన్ని అంతస్తుల కుటుంబాలకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తాం. అలాగే పై అంతస్తులలో స్వార్థ ప్రయోజనాల కోసం చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తాం.

–కనకమహాలక్ష్మి, జీవీఎంసీ 2వ జోన్ జెడ్సీ, మధురవాడ

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగద్గీతపై ప్రచారం



కోరాడలో త్రైత సిద్ధాంత భగద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని కోరాడ, రెడ్డిపల్లి పంచాయతీల పరిధిలోని సుంకరపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కృష్ణాష్టమి ప్రాముఖ్యత, శ్రీకృష్ణుడి ఊరేగింపు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు శ్యామ్, సంతోష్, రాజు, లక్ష్మి, బంగారు తల్లి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి చిన్నశ్రీను నివాళులు


నారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఇటీవల అస్వస్థతతో మృతి చెందిన జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్ది నారాయణరెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి సతీమణి మహాలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్నేహితుడికి ‘ఫ్యాబ్’ ఆర్థిక సాయం


తమ స్నేహితుడు యాసిన్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలోని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ఆధ్వర్యంలో తమ చిన్ననాటి స్నేహితుడు, ప్రైవేటు బస్సు డ్రైవర్ షేక్ యాసిన్‌కు ఆర్థిక సాయం అందించి పెద్ద మనసు చాటుకుంది. ఇటీవల జరిగిన గుండె ఆపరేషన్ చికిత్స, మందుల ఖర్చుల నిమిత్తం రూ. 15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ, సభ్యులు ముసునూరి సూర్యశ్రీనివాస్, మరోజు గోపి, గుగ్గిళ్ల సాయి, కట్టమూరి రమణరావు, కట్టమూరి అశోక్, విజ్జపు సత్యన్నారాయణ, దేవానంద్ పాల్గొన్నారు.

సిటీ బస్సుల్లో విద్యార్థినులకు వేధింపులు

తగరపువలస: విశాఖ, విజయనగరం పట్టణాల మధ్య నడిచే సిటీ బస్సులలో ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయని విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. విజయనగరం–విశాఖ మధ్య పలు విద్యాసంస్థలు ఉండటంతో నిత్యం వేలాది మంది విద్యార్థులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, జుగుప్సాకరమైన మాటలతో బాధిస్తున్నారని వాపోతున్నారు. ఇలాంటి వారిని డ్రైవర్లు, కండక్టర్లు కూడా మందలించకపోవడంతో రోజురోజుకూ వీరి ఆగడాలు శ్రుతిమించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గురుద్వారాను సందర్శించిన సీపీ

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఉదయం సింధియా న్యూకాలనీలోని సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ మందిరమైన గురుద్వారా దర్బార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మత పెద్దల ఘన స్వాగతాన్ని అందుకున్నారు. మందిరంలో సిక్కులతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా దర్బార్‌లో భక్తులకు సీపీ శుభాకాంక్షలను తెలిపారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించి, వారికి చాక్లెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైనారిటీల సంరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. స్థానికంగా ఏ సమస్య వచ్చినా తక్షణం 79950 95799 నంబర్‌లో తనను సంప్రదించాలన్నారు. అనంతరం సిక్కు మత పెద్దలు సీపీ బాగ్చిని ఘనంగా సత్కరించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం, గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద గల శ్రీరాధా మదన మోహన మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్–2025 ఘనంగా జరుగుతోంది. 2న ప్రారంభమైన ఈ సాంస్కృతిక కార్నివాల్ ఈనెల 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సోమవారం పౌరాణిక వేషధారణ, భగవద్గీత శ్లోక పఠనం, మంగళవారం భగవద్గీత శ్లోక పఠనం,6న గాత్ర సంగీతం,7న నాటకాలు, 9న శాస్త్రీయ నృత్యాలు,11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 99853 64430, 87901 60232 నంబర్లలో సంప్రదించాలని హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస కోరారు.


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ పట్టా అప్పారావు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ర్యాంకుల సాధన, విద్యలో ముందుండటం, మార్కుల ప్రాముఖ్యత గురించి వివరించారు. తోటి విద్యార్థుల పట్ల ఎలా వ్యవహరించాలో కూడా తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, వీఎస్ కృష్ణా కళాశాల సూపరెండెంట్ జీవీ అప్పారావు, ఉపాధ్యాయులు బి.ఆనంద్, ఎల్.ఎ.శ్రీనివాస్, వైవీ రమణ, జగన్నాధం, దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ పట్టా అప్పారావును సత్కరిస్తున్న విద్యార్థులు

6న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కొమ్మాది: ఈ నెల 6వ తేదీన భీమిలిలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ 1, 2, 3, 4వ వార్డుల విస్తృత స్థాయి సమావేశానికి 4వ వార్డు నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కాపులుప్పాడలో ముఖ్య నాయకులతో సమావేశమైన ఆయన.. ‘బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ’ ప్రచారం, నూతన కమిటీల ఏర్పాటు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలి అనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పాల రమణారెడ్డి, సాడి రమణ, వేముల ఈశ్వర్ రెడ్డి, దేవాడ నాయుడు, కోడిబోయిన వరహాలరావు, బుడ్ల కొండ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కొండబాబు

‘సూపర్ సిక్స్’తో బాబు మోసం

- ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయని చంద్రబాబు
- మద్దిలో ‘బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ’ కార్యక్రమం
- కూటమి మోసాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్నశ్రీను పిలుపు

పద్మనాభం: ఎన్నికల ముందు ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ హామీలను అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆరోపించారు. మండలంలోని మద్ది కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ‘బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ’ కార్యక్రమం, మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు లేనిపోని ఆశలు చూపించి చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ‘సూపర్ సిక్స్’లో ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి రూ.26 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి రూ.20 వేలే ఇస్తామని మాట మార్చారని ఆయన మండిపడ్డారు. ఈ రూ.20 వేలలో కూడా రూ.5 వేలు మాత్రమే ఇచ్చి రైతులను దగా చేశారని విమర్శించారు. మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ పథకం అసలు అమలు చేయలేదని ఆరోపించారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులున్నా..అందరికీ ‘తల్లికి వందనం’ అమలు చేస్తామని చెప్పి ప్రజలను బురిడి కొట్టించారని, రాష్ట్రంలో ఇంకా 30 లక్షల మంది పిల్లలకు ఈ పథకం అందలేదని శ్రీనివాసరావు పేర్కొన్నారు. చేయలేని పనులను చేసినట్టు చూపించి రూ.1.70 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని ఎద్దేవా చేశారు. భర్త చనిపోతే వారి స్థానంలో భార్యకు మాత్రమే వితంతు పెన్షన్లు మంజూరు చేస్తున్నారని, కొత్తగా ఒక్క పెన్షన్ కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మోసాన్ని ప్రతి గ్రామంలో ప్రజలకు తెలియజేస్తామని, ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావును ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ సత్కరించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గాడు శ్రీను, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, నాయకులు సుంకర బంగారప్పడు, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు, అముజూరి అప్పారావు, జి.వి.కె.కె.వర్మ, సుంకర పెద్దయ్య, బుగత శ్రీనివాసరావు, బేపల గురునాయుడు, తోనంగి అప్పలనాయుడు, కోరాడ రామేశ్వరరావు, కోన రమణ, బోని రమణమ్మ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కార్యకర్తలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి


తగరపువలస: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయని భీమిలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో జరిగిన ‘బాబు ష్యూరిటీ మోసం గారంటీ’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటికీ వైద్య సేవలు, వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందించడం వంటివి ప్రజలకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం జగనన్న పథకాలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందుతుందని శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన కూటమి హామీలు, వైఎస్సార్‌సీపీ పథకాలపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మండలపార్టీ అధ్యక్షుడు బంక సత్యం, సర్పంచ్ బావిశెట్టి పార్వతమ్మ, రాజు, మరుపిల్ల పద్మజ, జిల్లా ప్రధానకార్యదర్శి గండ్రెడ్డి శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీలో పాండ్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, మరుపిల్లి చిన్నయపాత్రుడు, గుండు నానాజీ, బోని అప్పలనాయుడు, పాండ్రంకి అప్పారావు, బంక కృష్ణమనాయుడు, ఆకుల సురేష్, ఎం.ఆదినారాయణ, మరుపిల్ల రామసత్యం, పైడిసత్యం, పి.బంగారి, సారిక ఆదినారాయణ, పల్ల రమణ, కోరాడ వెంకటరమణారావు, షిణగం దామోదర రావు, కంది శంకరరావు, అంజూరి సాయికార్తీక్, అంబటి ఉదయ్, పడాల రాము, తెడ్లాపు గోవింద్, కాళ్ల గౌరి, ఇల్లపు వెంకటరావు, అక్కరమాని అప్పలనాయుడు, ఎలమంచిలి మురళీకృష్ణ, రౌతు అప్పలరాజు, రాంబాబు, ముసలినాయుడు పాల్గొన్నారు.



కరపత్రాలతో కూటమి వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తున్న మజ్జి శ్రీనివాసరావు

రేషన్ సరకుల కోసం తిప్పలు

తగరపువలస: భీమిలి జోన్‌లో రేషన్ సరుకుల పంపిణీ పేదలకు కష్టాలు తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా రెండోవార్డులోని సంతపేట కుమ్మరవీధి, గొల్లవీధికి చెందిన వందలాది మంది కార్డుదారులు బియ్యం కోసం డిపోల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. రాష్ట్రంలో రేషన్ పోర్టబిలిటీ నిబంధనల ప్రకారం ఎవరైనా ఏ డిపో నుంచైనా బియ్యం తీసుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ, వాస్తవంలో వారికి డీలర్ల నుంచి నిరాదరణ ఎదురవుతోంది. తమ డిపోలకు కేటాయింపులు తక్కువగా ఉండటంతో, ముందుగా తమకు కేటాయించిన కార్డుదారులకే సరుకులు ఇవ్వాలని డీలర్లు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్ సరుకులను వాహనాల ద్వారా ఇంటి వద్దకే డెలివరీ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం ఈ డెలివరీ వాహనాలను నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతపేటకు చెందిన వందలాది మంది రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వలందపేట డిపో నుంచి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. అంత దూరం వెళ్లలేని వారు తమకు అందుబాటులో ఉన్న డిపోలకు వెళ్లినా సరుకులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతి నెల 10వ తేదీ తర్వాత రెండోసారి కేటాయింపులు చేస్తుందని, అయితే 15వ తేదీలోగా సరుకులు తీసుకోకపోతే ఆ నెల రేషన్ కోల్పోతామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్డుల సంఖ్యను బట్టి ఒకేసారి రేషన్ సరుకులు కేటాయించడంతో పాటు, దగ్గర్లోని డిపోలలో సరుకులు ఇచ్చేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకోవాలని పేద ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆలయం వద్ద మురుగుతో అవస్థలు


కాలువ పూడుకుపోవడంతో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిలిచిపోయిన మురుగునీరు


మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

భీమునిపట్నం: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మురుగునీటి సమస్య తీవ్రంగా మారింది. గత 15 రోజులుగా పూడికతో నిండిన కాలువలోంచి మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆలయం గోడకు ఆనుకుని ఉన్న ప్రధాన కాలువ పూడికతో నిండిపోవడంతో మురుగునీరు నిలిచిపోయి, తీవ్రమైన దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. ఈ నీరు సమీపంలోని ప్రధాన రహదారిపైకి కూడా చేరడంతో పాదచారులకు, వాహనదారులకు రాకపోకలు కష్టంగా మారాయి.ఈ సమస్యపై స్థానికులు జోనల్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చి వారం రోజులు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రజాప్రతినిధులు లేదా ఉన్నతాధికారుల నివాసాల వద్ద ఇలాంటి పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటారని, తమ విషయంలో ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కొండపై చెలరేగిన మంటలు


చెలరేగుతున్న మంటలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ సమీపంలోని కొండపై ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది నిర్మానుష్య ప్రదేశం కావడంతో కొండను చేరుకోవడం కష్టమైనప్పటికీ, ఒక్కసారిగా మంటలు చెలరేగడం స్థానికుల్లో ఆందోళన కలిగించింది.ఆకతాయిలు ఎవరైనా కొండపైకి చేరుకుని నిప్పు అంటించారా లేదా మరేదైనా కారణం ఉందా అనేది తెలియరాలేదు. సుమారు రెండు గంటల పాటు చెలరేగిన ఈ మంటలు సాయంత్రానికి అదుపులోకి వచ్చాయి.

అక్రమ నిర్మాణం కనిపించదా?


ప్రభుత్వ భూమి కలుపుకుని నిర్మించిన ఇల్లు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల అక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఐఐఎం లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్ 1 వద్ద ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వం ఓ లబ్ధిదారునికి 72 గజాల స్థలాన్ని కేటాయించగా, సదరు లబ్ధిదారుడు పక్కనే ఉన్న మరో 72 గజాల ప్రభుత్వ స్థలాన్ని కూడా కలిపి షెడ్లు, ఇల్లు నిర్మించుకోవడం వివాదాస్పదంగా మారింది. ఈ అక్రమ నిర్మాణాలకు స్థానిక రెవెన్యూ అధికారులు సహకారం అందించి లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నారని పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు తక్షణమే అక్రమణలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక శోభ

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం ‘హరే కృష్ణ, హరే రామ’ నామస్మరణతో మార్మోగింది. వారాంతపు ప్రత్యేక పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను, పలు ప్రవచనాలను ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయస్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.


అలంకరణలో రాధాకృష్ణులు

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను అడ్డుకోండి

మధురవాడ: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ, తమ ఇళ్ల వద్దకు వచ్చే అదానీ సిబ్బందిని వెనక్కి పంపాలని వామపక్ష ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం మధురవాడ రైతు బజారు వద్ద స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు పైడిరాజు, అప్పలరాజు మాట్లాడుతూ.. ఇప్పటికే అదనపు చార్జీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, స్మార్ట్ మీటర్ల ద్వారా అవి మరింత భారీగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే జరిగితే ప్రజలు సక్రమంగా జీవించే పరిస్థితులు ఉండవని, కాబట్టి ఈ ప్రయత్నాలను మొదట్లోనే అడ్డుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు రాజ్‌కుమార్, సత్యనారాయణ, కొండమ్మ, బేగం, పాత్రుడు, శారద, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న వామపక్ష నాయకులు